

www.gurujnanam.org

# శ్రీమద్భాగవతం ఆణిముత్యాలు

Contributor for Bhagavatam CD 4-2 to 5-2 Animutyalu: RAJESWARI.M

- భగవానుని నమస్కారం, స్తుతి , కర్మలు ఈశ్వరార్పణ చెయ్యడం, అర్చన, భగవద్పాదజ్ఞానం, భగవానుని కథాశ్రవణం, ఈ 6 అంగములుగల భక్తి "షడంగ భక్తి", భగవన్మయం చేస్తుంది.
- కోరికలు లేని స్థితి పరిపూర్ణస్థితి.
- జ్ఞానభక్తుడు భక్తికి ఆదర్శం.
- భగవంతునితో బంధం సహజం, ప్రపంచముతో బంధం అసహజం.
- ధర్మం లేనిదే భగవంతుడు దొరకడు. ధర్మము శృతి, స్మృతి రూపంగా లభిస్తుంది. వీటిపొందిక ఇతిహాసాలు, పురాణాలు. ఇవి  సామాన్య ప్రజలదగ్గరకు ధర్మాన్ని తీసుకొని వెళ్తాయి.

- సామాన్య ధర్మాలు : సత్యం, దయ, శుచి, శౌచం, సహనం, దమము, శమము, బ్రహ్మచర్యం, త్యాగం, శాస్త్ర అధ్యయనము, ఆర్జవము, సంతృప్తి,

సమదృక్,సత్పురుషుల సేవ, లౌకిక సుఖాలనుండి నెమ్మదిగా వెనక్కి వెళ్లడం, మౌనం, నిష్ప్రయోజనమైన కర్మలు, ఆత్మవిమర్శ, సంపాదన పంచి బ్రతకడం, కీర్తన, స్మరణ, సేవ, పూజించుట మొదలైన నవవిధ భక్తులు, చివరగా ఆత్మసమర్పణ. ఈ30 లక్షణాల ధర్మం పాటించాలి, హరి తృప్తి పడతాడు.

- మహాఋషులు చెప్పిన జీవిత సత్యం " ఈశ్వర అనుభవం".
- నిన్ను నీవు పాలించుకోవాలి అదే ధర్మం.
- జీవితం ఎలా గడపాలి అని భారతీయ ఋషి స్కెచ్ వేసి చూపించేరు.
- మానవస్వభావం ఎప్పుడు ఒక్కటే, ఆనాడు నియంత్రించే ధర్మానికి బలం వుంది, ఈనాడు లేదు.
- విష్ణుపూజ జరిగే ప్రతిచోటు పవిత్రమే.
- సాత్విక గుణంలో ప్రకాశం ఎక్కువగా ఉంటుంది.
- గొప్ప యజ్ఞం ఏమిటంటే మనోనిగ్రహం అనే అగ్నిలో, ఆ అగ్ని రగలాలంటే వివేకం అనే జ్వాలలో నీ అహంకారంని అందులో హోమం చెయ్యాలి.
- అధర్మం అనే ముళ్ళచెట్టుకి 5 శాఖలు.

1 . విధర్మం - ఏ ధర్మం చేస్తే నీ ధర్మం దెబ్బతింటుందో, అది చెయ్యకూడదు.

2 . పరధర్మం - స్వధర్మం ఆచరించు, పరధర్మాన్ని గౌరవించు.

3 . ఆభాసధర్మం - ధర్మంలా కనబడేది.

4 . ఉపమధర్మం - డాంభికము కోసం చేసేది.

5 . చలధర్మం - తప్పుడు వ్యాఖ్యానం చేసే ధర్మం.

- ఇది నీ పరిధి అని నిర్ణయించేదే ధర్మం.

◈ధర్మం భగవత్ స్వరూపం, వింటున్నంతసేపు ఆయన ప్రత్యక్షం అవుతాడు. ధర్మం ఆచరిస్తేనే ధర్మం అంటే ప్రీతి కల్గుతుంది.

◈ధర్మం చెవిలో పడితే, విష్ణువు గుండెలోకి వచ్చిన సంతోషం కల్గుతుంది.

◈ భాగవతం - ధర్మశాస్త్రం ◈

◈ భాగవతంలో అత్యంత ప్రధాన ఘట్టం"గజేంద్రమోక్షం", పంచరత్న గీతలలో ఒకటి.

◈ భగవద్గీత, విష్ణు సహస్త్రనామం, భీష్మ స్తవరాజం, అనుస్మృతి , గజేంద్రమోక్షం, ఈ ఐదు పంచరత్నగీతలు. మొదట నాలుగు భారతములోనివి, గజేంద్రమోక్షం ఒక్కటి భాగవతం లోనిది, అంటే భారతములోని నాలుగుతో ధీటుఅయినది గజేంద్రమోక్షం.

◈ ఆరోగ్యం, శత్రుబాధ లేకుండుట, అపకీర్తి లేకుండుట, దారిద్యంలేకుండుట ఈనాలుగు కావాలి అని అడగడం ధార్మికం. ఈశ్వరానుగ్రహం ఉంటే వస్తాయి. వేడినప్రార్థన వృధా కాదు.

◈ అర్హత సంపాదించుకోవడముకోసం భక్తుల వృత్తాంతం వినాలి.

◈ భాగవతంలో సారవస్తువుగా స్వీకరించబడినది గజేంద్రమోక్షం. పంచరత్నగీతలలో గీతతో సమాన స్థాయి పొందింది. సన్నివేశం గొప్పది. గజేంద్రుడు చేసిన స్తోత్రం వలన బ్రహ్మవిద్యా స్థానం లభించినది.

◈ జీవుని వేదన గజేంద్రమోక్షం.

◈ భాగవతభక్తులు గుంపులో గోవిందా కాకుండా

“గుంపులో గోవిందుడుగా”ఉండాలి.

- వేదమాత చెప్తుంది భాగవతభక్తులు ఏ ఉపాదిలోవున్న, అందులో అగ్రశ్రేణిలో వుండేటట్టు భగవంతుడు చూస్తాడు.
- నీటిలో మొసలికి బలం ఎక్కువ, సంసారంలో మోహానికి బలం ఎక్కువ.
- వేదాంతవిద్య సమరంలో చెప్పడం అంటే పరమార్ధం "బ్రతుకు నిత్యయుద్ధం” అని.
- మోహం (మొసలి) పట్టి పాశాలతో కట్టబడిన జీవులు, సంసారమే కాసరమై బయటపడలేక అందరు వున్నారు, గజేంద్రుడు ఒక్కడే మోహంనుండి బయట పడవేయమని విష్ణువుని ప్రార్ధించినవాడు.
- ఎవడికి వాడు ఒంటరి, తనది అనుకున్న బలం,తనదిఅనుకున్న బలగం రెండు పోతాయి.
- గజేంద్రమోక్షం అంటే మొదట జీవుని కథ, తరువాత ముముక్షువు కథ, చివరగా ముక్తుని కథ.

- మోహం క్షయిస్తే మోక్షం, అవిద్యకి మరోపేరు మోహం, నీవుకానిదానిని నువ్వు అనుకోవడం,నువ్వుఅన్నది తెలుసుకోలేకపోవడం.
- అజ్ఞానానికి ఈవల జీవుడు, ఆవల భగవంతుడు, ఈవల, ఆవల తీసివేస్తే అంతా భగవంతుడే.
- రుచిని చూడాలిఅంటే చూడలేము, అనుభవం మాత్రమే, అలానే పరమాత్మ సాక్షాత్కారం అనుభవం. చూడాలి అన్న తపన అనే ఒకే లక్ష్యంతో అది

సాధ్యపడుతుంది.

◈ ఆలోక వ్రతం అంటే కోరికలు లేనిది,

లోకములో చెయ్యనిది. దానికోసం సంగములు అన్ని విడిచిపెట్టి, మౌనంతో, సత్ప్రవర్తనతో వుంటూ రాగద్వేషములు ఏ భూతములయందు లేకుండా, పరమపదమే నాకు దిక్కు అన్న లక్ష్యంతో వుండే ముక్తులు ఆచరించే విధానం.

◈ అద్భుతాలు విశ్వంలో నింపివేసిన పరమాత్మకు నమస్కారం.

◈ ◈ భగవంతుడు అంటే ; (వ్యాస భాగవతంలో)

గజేంద్ర ఉవాచ :

◈ ఓం నమో భగవతే తస్మై యత ఏ తత్ చిదాత్మకం !

పురుషాయది బీజాయ పారేశాయాభి ధీమహి.

◈ యస్మిన్నిదం యతశ్చేదం యేవేదం య ఇదం స్వయం !

యోస్మాత్ పరస్మాత్ చ పరస్తం ప్రపద్యే స్వయం భువం||

◈ ◈ పోతన గారి భాగవతంలో; "తెలుగు వారి మంత్రం" ఇది.

◈ ఎవ్వని చే జనించు జగమెవ్వనిలోపల నుండు; లీనమై, యెవ్వనియందు డిందు బరమేశ్వరుడెవ్వడు మూలకారణం బెవ్వడనాది మధ్యలయుఁ డెవ్వడు సర్వము దానయినవాడెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.

◈ మోక్షానికి ప్రభువు కృష్ణుడు. మోక్షమే ఆయన. శాస్త్రాలకు, వేదాలకు సముద్రం వంటివాడు. త్రిగుణాలు అనే అరణి లోపల చిదగ్నిగా వున్నవాడు. సాధనతో ఉద్భవించే జ్ఞానాగ్ని పరమాత్మ.

◆ భగవంతుడిని పట్టుకోవడం అంటే తనవాడిని పట్టుకోవడం, తనను తాను పట్టుకోవడం, తనకు తానై మిగిలిపోవడం.

◆ విశ్వము ఎందుకు వుంది అంటే విష్ణువుని తెలుసుకోడానికి, విశ్వముతో విష్ణుని చూస్తే, విష్ణుమయం. మయం తీసివేస్తే "విశ్వము విష్ణువే".

◆ గజేంద్రవరదుడైన శ్రీకృష్ణునికి జయము ◆

◆ భగవంతుడు అందరివాడు. ఆశ్రయించిన భక్తుల వాడు. నావాడు అనుకున్నవారు కొద్దిమంది,వారికి భగవంతుడు ఎప్పుడూ వాళ్ళవాడే.

◆ సత్పురుషులకు సాక్షిభూతుడైన పరమాత్మ సగుణుడై రక్షిస్తాడు.

◆ శరణాగతి వ్యాఖ్యానం "గజేంద్రమోక్షం"

◆ సగుణ, నిర్గుణ తత్త్వమును చూపించాడు గజేంద్రుడు.

◆ ప్రేమిస్తే భక్తి, తెలిస్తే జ్ఞానం.

◆ గజేంద్రుని ఆకాంక్ష : ఆత్మలోకమనే మహాప్రకాశాన్ని చూడకుండా అజ్ఞానం అనే ఆవరణ కప్పివేస్తుంది. ఆ అజ్ఞానం నుండి నీ అనుగ్రహం ద్వారా నాకు తొలిగించి, ముక్తి కలుగచెయ్యి, అని అనంతశక్తివంతుడు, ఆత్మస్వరూపుడుని శరణు వేడుతున్నాడు.

◆ పరమాత్మప్రాప్తికోసం అడ్డుకుంటున్న అవరోధాలు తొలిగించటం అంటే మోక్షమే.

◆ భక్తికి పరాకాష్ట అద్వైతం, విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి అవుతున్నకొద్దీ , అద్వైతం పరమసత్యం అనిబుజువు అవుతుంది.

❖ సర్వవ్యాపకమైన బ్రహ్మం అక్కడికక్కడే “హరి”గా ఆవిర్భావం జరిగింది, గజేంద్రుడు చేసిన ప్రార్థన అనే భగవంతుని యదార్ధ స్వరూపం అయిన "నిర్విశేషబ్రహ్మ స్తుతి” వలన.

❖ రమ్యమైనభావన గజేంద్రుడు చేసిన స్తుతికి :
జ్ఞానాత్మకమైన స్తోత్రం - వాహిక;
వేదమంత్రాలు రెక్కలుగా కలిగిన వేదపురుషుడు -గరుత్మంతుడు ;
వేదవేద్యుడైన విష్ణువు గజేంద్రుని వాక్కులు అనే చందములు ద్వారా చక్రాయుధంతో సాక్షాత్కరించేడు. భగవద్ స్పర్శతో గజేంద్రుడు కోరుకున్న అజ్ఞానబంధం నుండి విడివడి మోక్షప్రాప్తి పొందేడు.

❖”భగవంతుడు, భాగవతుడు, భాగవతం ఒక్కటే” అని పుట్టపర్తి నారాయణాచార్యులు చెప్పారు .

❖ బ్రహ్మలోకం వరకు విశ్వము, విశ్వాతీత భూమికలు వైకుంఠం, కైలాసం, మణిద్వీపములు. వీటికి చతుర్దశభువన వికారాలులేవు.

❖ నిన్నునీవు మరచి స్తుతిస్తే, స్వామి తననుతాను మరచి అనుగ్రహిస్తాడు. ఇది భక్తరక్షణ పరాయణత్వం. భక్త వాత్సల్యంతో వున్నవాడు వున్నట్లే వచ్చాడు.

❖ దీపంకదిలితే కాంతి కదులుతుంది, విష్ణువు కదిలితే వైకుంఠం వస్తుంది.

❖ గజేంద్రమోక్షం ఫలశృతి విష్ణువే చెప్పారు .

❖ ❖ మరిఒక రమ్యమైన ఘట్టం “క్షీరసాగరమధనం”.మనబ్రతుకు పరమార్ధంని పొందవలసిన ఘట్టం. అనేక తత్త్వాలు దాచుకొన్న ఘట్టం.

❖ కూర్మావతారం, నీలకంఠుడైన మృత్యుంజయుడు, లక్ష్మిదేవి ఆవిర్భావం,

ధన్వంతరి ఆయుర్వేదం, మోహినీఅవతారం, శివశక్తుల ఏకీభావం అనే వివిధ అంశాలతో కూడినది క్షీరసాగరమధనం.

- పరబ్రహ్మ ఒక్కటే, బ్రహ్మం శివునిగా భావిస్తే శివవిశ్వరూపం, విష్ణువు బ్రహ్మము అయినప్పుడు విష్ణువిశ్వరూపం.
- భువనభయాలు పోగొట్టే వ్యసనపరుడు శివుడు.
- విషాన్ని కూడా అమృతంగా మార్చుకున్న మృత్యుంజయునకు నమస్కారం.
- "నీలకంఠాయ నమశ్శివాయ" విషాన్ని నిగ్రహించిన స్వామి స్వరూపం సర్వ విషబాధలు పోగొడతాడు.
- హరిని ముందు పెట్టుకో, సిరి స్థిరంగా ఉంటుంది.
- అమృతాన్ని మరిచిపోనిస్తుంది మొహం.
- శ్రీసఖీఅంటే లక్ష్మిదేవి సఖి లలితాదేవి. రాక్షసులకు జగన్మోహిని, దేవతలకు జగన్మాత.
- క్షీరసాగరమధనం యోగపరంగా;

మందర పర్వతం : మన వెన్నుదండం.

సర్పం : కుండలిని, మధనం చేసేటప్పుడు మనలో అటు, ఇటు కదిలే

వామసంచారం : అసురత్వం,దక్షిణసంచారం : దైవత్వం.

ఉఛ్వాసనిశ్వాసాలు : కదలికలు.

మధనం చెయ్యగా ఒకొక్క భూమికను దాటుకుంటూ వెళ్ళి సహస్రకమలాంతర్గతమైన మధువుని పొందేటప్పటికీ, అప్పటివరకు సుఖాలు అనుభవించిన అసురప్రవృత్తి జారిపోతుంది. సహస్రహారకమలం నుండి

అమృతాన్ని దైవప్రవృత్తి  కల జీవుడు అందుకుంటాడు.

❖ ఈశ్వరానుగ్రహం వలన దైవీసంపత్తిగల జీవుడే మోక్ష ప్రాప్తి  పొందుతాడు.

❖ ❖ సర్వవ్యాపకమైన బ్రహ్మం, శివ, విష్ణు, శక్తి పరంగా గజేంద్ర మోక్షం,
కూర్మావతారం,క్షీరసాగరమధనం, యందు దర్శనీయమైనవి. ❖ ❖

❖ ఆధారశక్తి కూర్మావతారం, కృంగిపోతున్న మనోనిబ్బరాన్ని నిలబెడుతుంది.

❖ వామనావతారం పూర్ణావతారం, భగవంతుడు తన తత్త్వాన్ని  పూర్తిగా
ప్రకటించాడు .

❖ స్వస్తి అంటే శుభాన్ని కలుగచెయ్యడమే. వామనుడు బలిచక్రవర్తికి శుభాన్ని
ఇవ్వడానికే వచ్చాడు.

❖ బ్రహ్మ వర్చస్సు రూపంతో లక్ష్మీదేవి వామనునితో  వుంది.

❖ దర్భకి ప్రత్యామ్నాయం అంగుళీయం, దర్భ వేలుకు చుట్టుకొని సంధ్యావందనం
చెయ్యాలి.

❖ బ్రహ్మం నోట పలికిన గీత, బ్రహ్మానుభవంతో పలికింది “వామనగీత”.

❖ అర్థకామాలను నియంత్రించేది ధర్మం.

❖ సంతృప్తి అనే గుణంఉంటే తేజస్సు పెరుగుతుంది. సంతృప్తి వున్నవారికి
మోక్షం వస్తుంది. సంతృప్తి లేకపోతే జన్మపరంపర వస్తుంది.

❖ ఋగ్వేదంలోని మంత్రం:
జీవితం అనే వృక్షానికి సత్యము, ధర్మము పుష్పఫలాలే. పువ్వులు, పండ్లు
వృక్షానికి ఎంత ముఖ్యమో, జీవితానికి సత్యం, ధర్మం అంతే ముఖ్యం.

◈ జీవితాన్ని, ప్రకృతిని, పరమాత్మని అధ్యయనం చేసి భూమిమీద మొట్టమొదట ప్రకటించిన సంపూర్ణజ్ఞానం వేదాలు. మన వేదసంస్కృతి, మనదేశం ఎంతగొప్పదో, దానికి మనం వారసులం, అవి మన వారసత్వ సంపద.

◈ సత్యఫలం, సత్య పుష్పం కల జీవితవృక్షాన్ని అసత్యంతోనైనా కాపాడుకోవడం దోషం కాదు. ఇది ధర్మశాస్త్రం చెప్పింది.( పోతనగారి పద్యం - వారిజాక్షులందు)

◈ విష్ణువు కొత్తగా త్రివిక్రముడు కాలేదు. ఎప్పుడు వున్నదే, వున్నరూపాన్ని చూపించేడు. ఆ సత్యదర్శనం చూసే భాగ్యం బలిచక్రవర్తికి దానం వలన కల్గింది.

◈ మూడింటిలో ఉన్నవాడిని( లోకాలు, కాలాలు, బ్రతుకు అవస్థలు, గుణాలు, పనులు, ఓంకారం అన్ని మూడుయే) చూడు, తరువాత దాటినవాడు అర్థం అవుతాడు, అప్పుడు నీవు దాటగలవు. ప్రపంచం అంతానిండిపోయిన త్రివిక్రముడు ఆంటే ఆనందం,సుందరం. అదే "త్రిపురసుందరి". ఇది త్రివిక్రమ జ్ఞానం. నీ మూడు భూమికలలోవున్న అజ్ఞానం సంహరిస్తే కానీ, త్రిపురాసురసంహారం జరిగితేకాని, త్రివిక్రమ తత్త్వం తెలిస్తేకాని "త్రిపురసుందరి" సాక్షాత్కారం జరగదు.

◈ ముల్లోకాలను తనయందు ప్రకటించిన అవతారం వామనావతారం.

◈ ముందు "మమ"(నాది), తరువాత "అహం" ( నేను) ఇచ్చాడు బలిచక్రవర్తి, దానితో బలి విష్ణువువాడు అయిపోయాడు. అహంకార, మమకార సంపూర్ణ సమర్పణభావమే బలిచక్రవర్తి కథ.

◈ తనదానిని, తనని అర్పించుకొన్న భక్తుని పరమాత్మ తానే రక్షించుకొంటాడు.

ఇది విష్ణువు అనుగ్రహం.

◈ ◈ త్రివిక్రమతత్త్వం భాగవత రహస్యం ◈ ◈

◈ ◈ వామన చరిత్ర - త్రివిక్రమ అవతారం ◈ ◈

◈ ఆరాధించే భగవంతుడు, ఆదర్శంగా తీసుకొనే భాగవతులు, వీరిద్దరి కధలే భాగవతం. భాగవతుల జీవితంనిండా మెరిసిపోయేది భగవంతుడు.

◈ భువిని, దివిని మొత్తం కొలిచిన పాదం, బలిచక్రవర్తి అహంని అణిచిన పాదం, వామన త్రివిక్రమ అవతారం.

◈ సత్యం అని ఎప్పుడు స్పృహలోకి తెచ్చుకోకుండా,అసత్యంని కౌగలించుకొని, సర్వజీవులను ఆవరించే నిద్ర " మోహనిద్ర".

◈ అచ్చమైన జ్ఞానికి అంతా వైకుంఠమే.

◈ తపస్సు (భోగత్యాగం,నియమపాలన), భక్తియోగం, స్వధర్మం ఈ మూడింటితో హరి ప్రీతి చెందుతాడు.

◈ నీ ధర్మం హరిప్రీతితో చేస్తే విష్ణుజ్ఞానం అనుభవంలోకి వస్తుంది. క్రమంగా నిస్సంగస్థితి వస్తుంది.

◈ తనను తానుకూడా మరచి, విశ్వాన్ని అంతావిష్ణుమయంగా చూసేవానిని భగవంతుడే రక్షించుకొంటాడు. ఇది ఏకాంతభక్తి అంటే పూర్ణభక్తి.

◈ భగవంతుడిని చూపించేది జ్ఞానం, అదే సుదర్శనం. విష్ణువుని పొందే దారి చూపించేదే సుదర్శనం.

◈ విశ్వం అంతా వ్యాపించి, మాటకి, మనస్సుకి అందని పరమాత్మ భక్తుని గుండెల్లో ఉంటాడు. భక్తులకు పరాధీనుడు.

◈ భగవంతుని ఆయుధాలు :

ధర్మానికి రక్షా నైపుణ్యం, అధర్మానికి శిక్షా పటుత్వం.

◈ భగవద్ వాక్యం : అన్నివిడిచిపెట్టి, నన్ను విడిచిపెట్టలేనివాడిని, నేను విడిచిపెట్టాను.

" వనమాలి గదీ సాంఘీ శంఖీ చక్రీ చ నందకి

శ్రీమనారాయణో విష్ణుర్ వాసుదేవో భిరక్షతు"

వివరణ:

◈ గోపాలతపని ఉపనిషత్ ప్రకారం (అథర్వవేదం),

చక్రం: అగ్నితత్వం, శంఖం: జల మరియు వాయు తత్త్వం,

నందకం: ఆకాశ తత్త్వం

గద : భూతత్త్వం

ధనస్సు : కాలం, పంచభూతములను తాను చేతితో పట్టుకొన్నాను అని చెప్పడమే పంచాయుధ తత్త్వం.

◈ కాలం ద్వారా కర్మానుభవం ఇచ్చేవాడే నారాయణుడు.

భగవంతుని రంగు నీలం: అనంత తత్త్వానికి ప్రతీక.

వనమాల: మాయతత్త్వానికి గుర్తు.

◈ సంపూర్ణ విష్ణుతత్త్వ ఆవిష్కరణ భగవతోత్తముడైన అంబరీషుని చరిత్ర.

◈ విష్ణుపాద స్పర్శ చేత పునీతమైన గంగ భగీరదుని తపస్సుతో , శివుని జటాజూటమునుండి భూమిపై ప్రవహించిన "గంగావతరణం" స్మరణ పుణ్యదాయకం.

◈ రామావతారం: నారాయణుడు పరిపూర్ణరూపుడుగా అవతరించేడు. త్రేతయోగంలో కృతయుగం ధర్మాలను పాటింపచేసేడు. తన పరిధి లోనికి వచ్చినవారికి ముక్తి ప్రసాదించేడు.

◈"రామచంద్రుడు పరబ్రహ్మ".◈

◈ రంతిదేవుని విష్ణు బుద్ధితో చేసిన కర్మకి ముక్తి ఇచ్చేడు పరమాత్మ.

◈ కృష్ణస్తు భగవాన్ స్వయం ◈

◈ విష్ణు కథాశక్తి కలవారికి, విష్ణుకథలు చెప్పేవారికి, వినేవారికి గంగాజలం వలె నిర్మలులుగా చేస్తుంది విష్ణు కథాప్రసంగం.

◈ కలియుగంలో ఒకే ఒక దిక్కు కృష్ణ చరిత్ర. దానివలన మనం తరించగలం.

◈ మథుర మోక్ష పట్టణం. నగరాలు మోక్షపట్టణాలు అవడం విశేషం, అరుదు. నారాయణుడు నిత్యసన్నిహితుడు. కృష్ణస్వామిఅవతారానికి ముందే అది విష్ణుధామం.

◈ సప్తపురులు :

అయోధ్య, మథుర, మాయ, కాశి,కంచి, అవంతిక, ద్వారక.

◈ పురుషసూక్త మంత్రాల ద్వారా ప్రతిపాదించిన యజ్ఞేశ్వరుడు, జగన్నాథుడు, దేవదేవుడు, విరాట్ పురుషుడు, పరమపురుషుడు కృష్ణుడుగా అవతరించారు .

◈ కృష్ణుడు వసుదేవ సుతుడు. వసుదేవుడు సత్యనిష్టాపరుడు, పవిత్రచరితుడు. దేవతలు దుందుభులు మ్రోగించేరు వసుదేవుని జన్మ సమయమున,ఎందుకంటే

నారాయణుడు ఈయనకు పుత్రుడుగా జన్మిస్తాడని, ప్రజలుఉత్సవాలు చేసుకొన్నారు.

- కథచెప్తూ చిన్న సందేశం ఇవ్వడం అన్నది మంచి మాట.
- నిగ్రహసంపన్నులు; ప్రతిదాన్ని పరిత్యజించగలరు,వైరాగ్య సంపన్నులై వుంటారు.

సత్పురుషులు; దేనినైనా సహిస్తారు.
జ్ఞానులు; ఏది కోరుకోరు.
దుర్మార్గులు; ఏదైనా చేస్తారు, అకార్యం, సకార్యం అన్నది లేదు. ఏ దుష్కార్యమైన చేస్తారు.

- ఎంత దుర్మార్గుడైన ధర్మనిష్ఠ కలిగిన వారిని చూడగానే కాసింత మంచి స్పృహ కలుగుతుంది.
- దేవకీదేవి విశ్వమునే గర్భంలో ధరించిన శ్రీహరిని గర్భాన ధరిస్తూ జ్ఞానఖలుని ( ఎంత జ్ఞానం వున్నా ఇతరులకు అందివ్వనివానిని, జ్ఞానానికి తగ్గట్టు జీవించనివానిని) ఇంట శారదవలే , కుండలోని దీపమువలె, సోదరుడైన కంసుని ఇంట్లో బందించబడినది. దేవకీ గర్భాన్ని చూస్తున్న కంసునికి, హరి అనే సింహం ప్రవేశించిన గుహలా అనిపించింది.
- భయం యోగమైతేనే గాని ముక్తి రాదు. కంసుడు విశ్వానంతటిని విష్ణు మయంగా చూస్తున్నాడు. ప్రపంచం విష్ణుమయం అయ్యింది కంసునకు. ఆశ్రయించిన అందరికి ఆఖరి జన్మ చేసిన అవతారం ముకుందావతారం.
- మనం అనుకున్న దాన్నే చుట్టూ చూడడం అన్నది అలవాటు, ఇది నిరంతర

జ్ఞానం.

◆ విష్ణుదేవుడు చెప్పిన యోగమాయాదేవి నామాలు: దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాన, శారద, అంబిక.

◆ విశ్వగర్భ గర్భయగుచు : విశ్వం అంతా ఎవరిలోవుందో ఆయన ఆవిడలో (దేవకి) వున్నాడు. ఇది కృష్ణస్వామి జనన సమయాన వ్యాసుని హృదయం.

◆ సత్యనారాయణ తత్త్వం: స్తుతులలో మకుటాయమానమైనది బ్రహ్మ స్తుతి, దేవతలతో వచ్చి దేవకీ గర్భస్థుడైన శ్రీకృష్ణుని స్తుతించిన సందర్భములో సత్యనారాయణ తత్త్వం వుంది.

◆ పరమాత్మసత్యవ్రతుడు అంటే వ్యర్థం కానీ సంకల్పం కలవాడు. పరమాత్మని పొందడానికి సాధన సత్యం. పరమాత్మ త్రిసత్యం అంటే మూడు కాలలో మార్పు లేనివాడు. పంచభూతాలు వ్యవహారిక సత్యాలు, అందులో అంతర్యామిగా వున్న పరమాత్మ పరమార్థక సత్యం. సత్యమే నారాయణుని స్వరూపం.

◆ కృష్ణుని పుట్టుకతో భూభారం తొలిగింది, కృష్ణుని పాదస్పర్శ భూమికి లభించింది.

◆ భగవద్ అవతారం ఆవిర్భవిస్తున్నప్పుడు ప్రకృతి శుభంగా, శాంతంగా మారిపోతుంది. పంచభూతాలు శాంతి పొందుతాయి. అత్యంత మంగళకరమైన కాలం, అందరి మనసులు ఆనందం అయిపోయాయి. ఆనందం వెల్లువిరిసింది

అంతటా.

◈ "దేవకీదేవి దేవదేవుని కన్నది" ◈

◈ అష్టమి నాడు పూర్ణచంద్రోదయం అయింది. అద్భుత తత్వమైన పరమాత్మ బాలునిగా కనబడ్డారు. నారాయణ లాంఛనాలతో , సంపూర్ణ విష్ణు స్వరూపం ఆవిష్కరణ జరిగింది. చక్కని శంఖ,చక్ర, గదా, పద్మాలతో , కంఠంలో కౌస్తుభమణితో, శ్రీవత్సంతో పూర్ణచంద్రుని కాంతితో ప్రకాశిస్తున్న బాలకృష్ణుని కన్నారు దేవకీవసుదేవులు.

◈ శ్రీకృష్ణ గోవింద హరే మురారే,

హే నాథ నారాయణ వాసుదేవ ◈

◈ దేవకి స్తుతి : ఆధ్యాత్మ దీపమైన సాక్షాత్ విష్ణువు వున్నవాడు వున్నట్టుగా వచ్చేడు. బ్రహ్మ తత్త్వం అద్భుతం, అది బాలుడై కనబడ్డారు.

◈ దేవకీవసుదేవులకు కృష్ణ జననం నయనోత్యవం,రేపల్లెలో మహోత్సవం.

◈ యశోద “చిన్ని మగవాని గనెనట చూచి వత్తమమ్మ” తెలుగుభాషలో అత్యంత రమ్యమైన పదం “చిన్ని మగవాని” దాని అందం వ్యాఖ్యానానికి అందదు.

◈ కృష్ణస్తు భగవాన్ స్వయం ◈